# కొవ్వూరులో వైట్‌ఫీల్డ్ పేపర్స్ యూనిట్

## 2008 నాటికి వాణిజ్య ఉత్పత్తి

హైదరాబాద్, మార్చి 27 ( ఆన్‌లైన్): వైట్‌ఫీల్డ్ పేపర్ మిల్స్ లిమిటెడ్ పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో పేపర్ మిల్లు పెట్టాలని నిర్ణయించింది. ఈ కంపెనీ 1200 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనుందని ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి సోమవారం నాడిక్కడ ప్రకటించారు. శాసనసభ కమిటీ హాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వైట్‌ఫీల్డ్ పేపర్స్ లిమిటెడ్ ఛైర్మన్ టి. శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి లక్ష్మీపార్థసారథిలు ఈ యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి జె. గీతారెడ్డి, పరిశ్రమల శాఖ కమిషనర్ సుదీర్ఘ భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు. వైట్‌ఫీల్డ్ పేపర్స్ యూనిట్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు దశల్లో 450 ఎకరాలు కేటాయించనుంది. పేపర్ తయారీకి అవసరమైన ముడిపదార్థాలను కంపెనీ దిగుమతి చేసుకోనున్నందున ఎలాంటి పర్యావరణ సమస్యలు ఉత్పన్నంకావని ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ప్రకటించారు. ఈ యూనిట్‌కు ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఇజెడ్) హోదా ఇప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి కంపెనీ తన పనులు ప్రారంభించనుందని, ఫైనాన్సియల్ క్లోజర్ వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తికాగలదని భావిస్తున్నట్లు కంపెనీ ఛైర్మన్ టి.శ్రీనివాసరావు తెలిపారు. 1250 కోట్ల రూపాయల పెట్టుబడిలో 480 కోట్ల రూపాయలు ఈక్విటీగా, 720 కోట్ల రూపాయలు రుణాలుగా సేకరించనున్నట్లు చెప్పారు. ఈక్విటీలో 200 కోట్ల రూపాయలను పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించుకోనున్నట్లు తెలిపారు. సంవత్సరానికి రెండు లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ యూనిట్‌ను నెలకొల్పుతున్నారు. ప్రతిపాదిత ప్రాజెక్టుకు అవసరమైన విద్యుత్ కోసం 40 మెగావాట్ల సామర్థ్యంతో కో-జనరేషన్ యూనిట్ ఏర్పాటు ద్వారా సమకూర్చుకోనున్నట్లు చెప్పారు. స్వీడన్‌కు చెందిన ఎలోఫ్ హన్సన్ గ్రూప్‌తో ముడిపదార్థాల సరఫరాకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకొన్నట్లు చెప్పారు. ఈ యూనిట్ వల్ల ప్రత్యక్షంగా వెయ్యి మందికి, పరోక్షంగా పదివేల మందికి ఉపాధి అవకాశాలు లభించగలవని పేర్కొన్నారు.